بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 01 Aug 2025 (Telugu)

# యు.కె. వార్షిక మహాసభలు సందర్భంగా దైవానుగ్రహాల ప్రస్తావన
# పలువురు నూతన అహ్మదీయులు, జమాఅతేతర అతిథుల అభిప్రయాల ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 01.08.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఆదివారం రోజున అల్లాహ్ తఆలా కృపానుసారం యు.కె. వార్షిక బహిరంగ సభలు ముగిసినవి. ఈ మూడు రోజులు ఎంతో శుభకరమైనవి, అల్లాహ్ తఆలా అనుగ్రహాలను అందించునవిగా ఉండెను. అల్లాహ్ తఆలా మనపై తన ఉపకారాన్ని కురిపిస్తూ మనందరిని ఈ మూడు రోజులు తన లెక్కలేనన్ని అనుగ్రహాలతో కరుణించెను, సభలను అన్ని విధాలా విజయవంతం చేసెను, సభలు సఫలీకృతంగా ముగింపునకు చేరుకున్నవి. అల్లాహ్ తఆలా దయానుసారం వాతావరణం కూడ మంచిగానే ఉండెను, కార్యక్రమాలన్ని ఎంతో చక్కగా ముగింపునకు చేరినవి. సభల ప్రాథమిక కార్యక్రమాలు అనగా ఉపన్యాసాలు, ఇతర కార్యకలాపాలతో పాటు ప్రచార, విజ్ఞాన పరంగా విభిన్న శాఖల ప్రదర్శన శిబిరాలు ఏర్పాటు చేయబడెను. ఇతరులపై వీటి ప్రభావం కూడ చాలా మంచిగా పడెను. అహ్మదీయులలో కూడా అధికులు తమ జ్ఞానము, అవగాహనను పెంచుకొను అనుగ్రహం పొందారు.

సభా కార్యక్రమాల మధ్యలో విరామం ఉన్నప్పుడు ఎమ్.టి.ఏ. కూడా విభిన్న విజ్ఞానపూర్వ కార్యక్రమాలను ప్రసారం చేసి మంచి అవగాహన కల్పించెను. ప్రజలపై వీటి ప్రభావం కూడ చాలా గొప్పగా పడింది. మాకు కూడా అనేక క్రొత్త విషయాలు తెలిసినవని ఇతర దేశాలలో కూర్చున్న అహ్మదీయులు కూడా వాటిని చాలా ఇష్టపడ్డారు. ఇంకా ఈ సారి ఎమ్.టి.ఏ. ప్రపంచంలోని సుమారు 56 దేశాలలోని 119 కేంద్రాలను సభతో ప్రత్యక్షంగా జోడించెను. ఈ సంప్రదింపుల కారణంగా వారు ఎలా సభలను వినే అనుగ్రహం పొందారనగా వారు తమను తాము స్వయంగా సభలలో హాజరైనట్లు భావిస్తుండిరి. అల్లాహ్ తఆలా అహ్మదియ్య జమాఅత్‌పై చేసిన శుభాలలో ఇది కూడ అతని ఒక పెద్ద శుభం. అనగా నూతన ఆవిష్కరణల ద్వారా ప్రపంచంలోని అహ్మదీయులందరిని ఏకం చేసెను. ఏకైక సమాజంగా మారిన ఈ దృశ్యం ప్రపంచంలో మరెక్కడా కనిపించదు.

ఈసారి దాదాపు ఏర్పాట్లన్ని గత సంవత్సరాల కంటే మంచిగా, మెరుగ్గా ఉండెనని అధిక ప్రజలు అభిప్రాయపడ్డారు. అధికులు ప్రస్తావించారు కూడ. ఇక్కడ నేరుగా పాల్గొన్నవారు, టీ.వి.

ద్వారా వివిధ దేశాలలో కార్యక్రమాలను తిలకించేవారు కూడా ఇదే చెప్పారు. ఇదొక ప్రత్యేక వాతావరణంగా ఉండెను. సర్వం అల్లాహ్ తఆలా ప్రత్యేక శుభమే. సభలపై అల్లాహ్ తఆలా ప్రత్యేక అనుగ్రహాలు కురుస్తున్నవని ప్రతి ఒక్కరు అసాధారణంగా భావిస్తుండెను.

అల్లాహ్ తఆలా ఇట్లు ఉపదేశించెను. మీరు నాకు కృతజ్ఞతలు తెలుపు దాసులుగా మారి, మీరు కృతజ్ఞతలు తెలిపినప్పుడు నేను నా అనుగ్రహాలతో ఇంకా ఎక్కువ ప్రసాదింతును, అధిక శుభాలను మీపై కురిపింతును. కావున అల్లాహ్ తఆలా అధిక శుభాలకు వారసులుగా మారుటకు కృతజ్ఞత తెలుపు అవసరముంది. అల్లాహ్ తఆలా తన గురించి ఇట్లు నుడివెను. అల్లాహ్ తఆలా నిశ్చయంగా దాసుల కృతజ్ఞతలను గుర్తించును. అల్లాహ్ తఆలా కొరకు కృతజ్ఞత అనే పదం ఉపయోగించినప్పుడు అది గుర్తించు అర్థంలో ఉపయోగించబడును. సారాంశమేమనగా కృతజ్ఞులను అల్లాహ్ తఆలా గుర్తిస్తాడు. ఈ గుర్తింపు కారణంగా అల్లాహ్ తఆలా వారిని కరుణిస్తూ పోతాడు. ఇలా మాటల వరకు మాత్రమే పరిమితం కాకూడదు. కృతజ్ఞత భావం ఉండవలెను. ఈ భావాన్ని అల్లాహ్ తఆలా తన కృపానుసారం తన జమాఅత్‌లో కల్పించినాడు. దీనిని అల్లాహ్ తఆలా పెంచుతుండును గాక! పాల్గొనువారందరు ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమనగా వారు అల్లాహ్ తఆలాకు కృతజ్ఞత తెలుపడంతో పాటు సేవలందించిన సేవకులకు కూడా కృతజ్ఞతలు తెలుపవలెను. ఈ సేవకుల పనులను అల్లాహ్ తఆలా ఏ విధంగా సులభతరం చేశాడో, వారి కష్టాలను దూరం చేశాడో, వారి ప్రతి పనిని మెరుగుపడేలా ఎలా చేశాడో, అధికాధిక ప్రజలకు సేవలందించు అనుగ్రహం వారికి ప్రసాదించెనని, ఇలా పాల్గొనువారి కొరకు సౌకర్యం, అధిక, మంచి వెసులుబాటు కల్పించెనని కృతజ్ఞతలు తెలుపవలెను.

ఈ సంవత్సరం అల్లాహ్ తఆలా కృపానుసారం 50 వేల మంది హాజరైనారు. సేవకుల ద్వారా వారికి అల్లాహ్ తఆలా ఏ విధంగా సౌలభ్యాలను సృష్టించెనని ఈ పాల్గొనువారందరు కృతజ్ఞత తెలుప వలెను. వారికి రవాణా, ఆహారం, సభల కార్యక్రమాలను విను విషయంలో ఎలాంటి కష్టం ఏర్పడలేదు. వారి ఇతర వివిధ అవసరాలు పూర్తి అయినవి. ఈ పనులన్ని అల్లాహ్ తఆలా శుభంతో సాధ్యమైనవి. ఇందులో మన విశిష్టత ఏమియును లేదు. సర్వం అల్లాహ్ తఆలా అనుగ్రహమే. కావున ఇందుకు సేవకులు కృతజ్ఞతలు తెలుపవలెను. అల్లాహ్ తఆలా మమ్ములను అనుగ్రహించాడని, మా పనుల మంచి ఫలితాలను వెల్లఢించాడని వారు అనగా సేవకులు కూడ కృతజ్ఞతలు తెలుపుకోవలెను. అల్లాహ్ తఆలా తమ కొరకు ఎలా సౌకర్యాలను సమకూర్చినాడని పాల్గొనువారు కూడా కృతజ్ఞతలు తెలుపుకోవలెను. అనేక శ్రేణులకు, విద్యా ప్రమాణాలకు సంబంధించిన వారు రాత్రింబవళ్లు శ్రమించి అల్లాహ్ తఆలా ప్రీతి కొరకు ఉచితంగా తమ విధులను నిర్వహించినారు. ఇదే విధంగా కెనడా, ఆస్ట్రేలియా నుండి కూడా యువకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఉండిరి. వారు సభల కంటే ముందు కూడా సభల పనులలో సహకరించిరి, సభలు జరుగుతున్నప్పుడు కూడా తర్వాత వైండ్అప్‌లో కూడా సహకరిస్తున్నారు. అల్లాహ్ తఆలా వారందరికి ప్రతిఫలం నొసంగుగాక!

ఒక హదీసె ఖుద్సీ ఆధారంగా హుజూరె అన్వర్ ఇట్లు సూచించారు. అల్లాహ్ తఆలా తన కొరకు చేయబడే తన దాసుల పనులను గుర్తిస్తాడు. సేవకులకు కృతజ్ఞత తెలుపమని కూడా అల్లాహ్ తఆలా ఆదేశిస్తున్నాడు. అల్లాహ్ తఆలా దాసులకు మనం కూడా కృతజ్ఞతలు తెలుపాలని ఆశిస్తున్నాడు.

తద్వారా కృతజ్ఞతతో కూడిన వాతావరణం ఏర్పడును. నలు వైపులలో కృతజ్ఞతభావం ఏర్పడును. ఇదే విషయాన్ని మనం ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇక్కడికి వచ్చిన అనేక మంది అతిథులు నాతో భేటీ అయినప్పుడు తమ వివిధ అభిప్రాయాలను వ్యక్తపరచినారు. వివిధ సేవలు చేస్తున్నవారిని మీ వృత్తి ఏమిటని మేము ప్రశ్నించాము. వారి పనులను బట్టి వారేదో కూలీ నాలీ చేసుకునేవారనుకున్నాం. కానీ నేనొక ఫరమ్‌లో అధికారినని ఒకరు చెప్పగా నేను చదువుకుంటున్నానని మరొకరు చెప్పిరి. ఇంకొకరు నేను పి.ఎచ్.డి. విద్యార్థినని, మరొకరు పి.ఎచ్.డి. పట్టాను పొందానని చెప్పాడు. ఇలాంటి భావాలు గల వారున్నారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అతిథుల సేవలకు అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందుటకు తమను తాము సమర్పించుకున్నారు. ఇక్కడికి వివిధ దేశాల నుండి జమాఅతేతర అతిథులు కూడా వస్తుంటారు.  వారికి జమాఅత్ ప్రారంభ పరిచయం అందించబడుతుంది. వీరు మాట్లాడుతున్నట్లు ఆచరిస్తున్న నిజమైన ప్రజలేనా? అని తిలకించడానికి వారిక్కడికి వస్తుంటారు. ఒక సాధారణ కూలీ వలె పని చేస్తున్నట్లు, ఇలా అలా పని చేస్తున్నట్లు వివిధ వృత్తులకు చెందిన ఈ సేవకులను చూసినప్పుడు వారిపై గొప్ప ప్రభావం పడుతుంది. ఇదొక మౌన ప్రచారం, దానిని కూడా వారు వ్యక్తపరుస్తారు. క్రొత్తగా వచ్చినవారు అనగా జమాఅత్‌లో చేరినవారు లేదా మొదటి సారి ఇక్కడికి వచ్చినవారికి ప్రోత్సాహం లభిస్తుంది. ఎంత గౌరవమర్యాదలతో వారికి ఆతిథ్యం ఇవ్వబడుతుందో, వారితో ప్రజలు ఏ విధంగా వ్యవహరిస్తున్నారో గమనిస్తారు. కావున ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇందుకు మనందరం అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుకోవలెను.

ఈ నేపథ్యంలో హుజూరె అన్వర్ విభిన్న దేశాలకు సంబంధించిన జమాఅతేతర అతిథులు, క్రొత్తగా బైఅత్ చేసినవారు వార్షిక సభలలో పాల్గొన్నారని ప్రస్తావించిరి. అల్లాహ్ తఆలా కృపానుసారం సభల శుభముల ఫలితంగా వారు వెల్లడించిన మంచి అభిప్రాయాలను ప్రస్తావిస్తు అనేక విశ్వాసభరిత సంఘటనలను కూడ వినిపించారు.

రోడ్‌రెక్ ఐర్ల్యాండ్ పోలీస్ ఫోర్స్ కమిషనర్ ఇట్లు అభిప్రాయపడిరి. సభల రోజులలో నేను చూసింది నిజంగానే అదర్శవంతమైనది. క్రమ శిక్షణ పట్ల గొప్ప పాఠంగా ఉండెను. పది వేల సేవకులు అందుబాటులో ఉండుట ఒక విచిత్రమైన మహిమగా ఉండెను. ప్రతి ఒక్కరు కలిసి మెలిసి సాటిలేని సేవలందించెను.

మానవ హక్కుల సంస్థ ఎచ్.ఆర్.డబ్ల్యూ ప్రతినిధి అయిన బెల్జియం అతిథి ఒకరు ఇట్లనిరి. ఇంత విస్తృత స్థాయిలో ఒక సభ నిర్వహించడం, ఇందులో వేలాది సభ్యులు చాలా రోజుల వరకు పాల్గొనడం నిశ్చయంగా ఒక అసాధారణ విజయం. నిర్వహణ నైపుణ్యం మాత్రమే కాక  దీని  వెనుక ఉన్న సత్ప్రవర్తనల పునాది కూడ చాలా ప్రభావితంగా ఉండెను.

బల్గారియా నుండి క్రొత్తగా అహ్మదీ అయిన ఒక మహిళ ఇట్లు అభిప్రాయపడిరి. ఈ శుభప్రదమైన రోజులలో నేనొక నిరుపమాణ ఆధ్యాత్మిక వాతావరణాన్ని భావించాను, దీనిలో భాగమగు అనుగ్రహం నేను పొందాను. నా అనుభవం ఎంతో అద్భుతంగా, ప్రభావితంగా ఉండెను. ఎంతో చక్కగా అతిథుల సౌకర్యం, విశ్రాంతి పట్ల శ్రద్ధ చూపబడెను. జార్జియా నుండి వచ్చిన ఒక అతిథి ఇట్లు తెలిపినారు.

సభల వాతావరణం శాంతియుతంగా ఉండెను, ప్రసంగాలు, ఖలీఫా గారి ఉపన్యాసాలు ఆధ్యాత్మికంగా ముందుకు నడిపించుటకు చాలా గొప్ప పాత్ర పోషిస్తున్నాయి. ఒక అరబ్ దేశస్తురాలు స్వీడన్ నుండి వచ్చి ఉండిరి. ఆమె ఇట్లు తెలిపిరి. వార్షిక సభ మొత్తం కుటుంబాన్ని తమలో ఇముడ్చుకొను విధమైన ఒక విశాల గృహం మాదిరిగా ఉన్నది.

ఇంకా మరికొన్ని విశ్వాసపూరిత అభిప్రాయాలను ప్రస్తావించిన తర్వాత హుజూరె అన్వర్ ఇట్లనిరి. పాల్గొన్న అతిథులందరికి అల్లాహ్ తఆలా సంపూర్ణ నమ్మకం కలిగించుగాక! వారు అహ్మదియ్యత్‌ను, నిజమైన ఇస్లాంను అర్థం చేసుకొని ఈ కాలపు ఇమామ్‌ను కూడ విశ్వసింతురుగాక! క్రొత్త అహ్మదీయులను కూడా విశ్వాసం, వినయంలో ముందుకు నడిపించుగాక! ఇదే విధంగా సభల కార్యక్రమాలను చూసిన, విన్న ప్రతి అహ్మదీని వాటిని ఆచరించుటకు, వాటిని తమ జీవిత భాగాలుగా చేసుకొనుటకు, ధర్మమునకు ప్రాపంచికం పై ప్రాధాన్యత ఇచ్చుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! ఈ ఉత్సాహం సదా కొనసాగుగాక! సభ శుభలమును ప్రతి అహ్మది ఎల్లప్పుడు పొందుతుండుగాక! తమ మనసు, తమ పరిసరాల సంస్కరణ కొరకు కూడా శక్తి వంచన లేకుండా కృషి చేయునుగాక!

ప్రెస్ మొదలగు నివేదికను కూడా హుజూరె అన్వర్ సంక్షిప్తంగా ప్రస్తావించారు. జమాఅత్ ప్రెస్ మరియు మీడియా సెక్షన్‌తో పాటు దాని ఆధ్వర్యంలోని సుమారు 49 వెబ్ సైట్లు, ప్రింట్ మీడియా, పత్రికలలో 17 వ్యాసాలు, రేడియో మీద 25 కార్యక్రమాలు, ఇంకా టీ.వి. మరియు సోషల్ మీడియా ద్వారా అన్నిటిని కలిపినచో అల్లాహ్ తఆలా కృపానుసారం 100 మిలియన్ ప్రజలకు ఈ వార్త అందినది.

ఎమ్.టి.ఏ. ఆఫ్రికా వివిధ చానళ్లలలో వార్షిక సభల ప్రసారాలను తిలకించిన తర్వాత 50 మంది కంటే అధిక సభ్యులు బైఅత్ కూడా చేశారు. వార్షిక సభల 22 నేషనల్ మరియు రీజనల్ టీ.వి. చానళ్ళ ద్వారా 304 గంటల ప్రసారాలు ప్రసారం చేయబడినవి. తద్వారా 65 మిలియన్ మంది ప్రజల వరకు సందేశం చేరినది. సభ గురించి రేడియో స్టేషన్స్ ద్వారా 91 వివిధ నివేదికలు ప్రసారమైనవి. తద్వారా 16 మిలియన్ ప్రజల వరకు సందేశం అందినది. మీడియా అవుట్ లెట్స్‌తో పాటు ఇతర విభిన్న మాధ్యమాల ద్వారా 47 వార్తలు ప్రచురితమైనవి. తద్వారా 150 మిలియన్ ప్రజల వరకు సందేశం చేరినది.

ముగింపులో హుజూరె అన్వర్ గౌ॥ అబ్దుల్ కరీం జమాల్ జోదహ్ గాజా పాలస్తీనా అమరుని సద్గుణాలను ప్రస్తావించి, పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించి, మృతుని క్షమాపణ, స్థాయి అంతస్తుల పెరుగుదలకు ప్రార్థన చేసిరి.

اَلْحَمْدُلِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔